

వైవీయూలో విద్యార్థిని ఆత్మహత్య

వైవీయూలో మంగళవారం మధ్యాహ్నం పీజీ బయోటెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్. షమ్మా సుల్తానా(21) ఆత్మహత్య కలకలం రేపింది. -8లో



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. మంగళవారం ఆయా ప్రాంతాల నుంచి పలువురు పార్టీలో చేరారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 186 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	276	445
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 206.700 కిలోలు

న్యూస్‌రీల్

21న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరోతరగతి ప్రవేశం కోసం ఈనెల 21వ తేదీ ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు పొంది పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని చెప్పారు. 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రంలోకి రావాలని సూచించారు.

శ్లాస్ పరీక్ష కేంద్రాల తనిఖీ



విద్యార్థులు రాస్తున్న పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాజంపేట టౌన్: మండలంలో జరుగుతున్న శ్లాస్ పరీక్ష కేంద్రాలను మంగళవారం డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తనిఖీ చేశారు. అందులో భాగంగా మండలంలోని డీబీఎస్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండల వ్యాప్తంగా విదార్థుల విద్యా సామార్థ్యాలు ఎలా ఉన్నాయని ఎంఈఓ కొండూరు రఘునాథరాజును అడిగి తెలుసుకున్నారు. అన్ని పాఠశాలల్లో వాటర్‌బెల్ విధిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇంటిలో కూడా నీళ్లు తాగుతూ ఉండాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. అనంతరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ కొండూరు రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ)లైన డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వివింగ్,టైలరింగ్ , ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నోటిఫైడ్ ఎగ్జామినేషన్ సెంటర్లలో నిర్వహించనున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనూరాధ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను www.bsc.ap.gov.in లో పొందుపరిచినట్లు తెలిపారు. టీటీసీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

కడప మీదుగా తివేంద్రంకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కాచిగూడ నుంచి త్రివేంద్రం కొచ్చివేలికి కడప మీదుగా ప్రత్యేక రైలు (07229/07230)ను నడవనున్నారని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. కాచిగూడ నుంచి తివేంద్రం కొచ్చివేలికి ఈనెల 18, 25 తేదీల్లో బయలుదేరుతుందన్నారు. ఉదయం 6.05 గంటలకు ఈ రైలు కాచిగూడలో బయలుదేరి మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, ఎర్రగుంట్ల మీదుగా కడపకు మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుతుందన్నారు. అలాగే కడప నుంచి రేణిగుంట, కాటాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుపూరు, కోయంబత్తూరు, త్రిశూర్, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగనూరు, కొల్లాం మీదుగా తివేంద్రం కొచ్చివేలికి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల 19, 26 తేదీలలో కొచ్చివేలిలో మధ్యాహ్నం 12.50 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో శనివారం 6.25కు కడపకు చేరి సాయంత్రం 5.00 గంటలకు కాచిగూడ చేరుతుందని వివరించారు. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైలును నడపనున్నామన్నారు.

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప నగరానికి చెందిన బేడ, బుడగ జంగం నాయకులు పస్తం అంజిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆ పార్టీ అధ్యక్షుడు కె. సురేష్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నియామక పత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. రాజగోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, గోవిందు నాగరాజు, సీహెచ్ సునీల్, కంచుపాటి బాబు, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా సుహేల్
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా కడప నగరానికి చెందిన ఏ టు జెడ్ మొబైల్స్ ప్రొప్రైటర్ మయానా సుహేల్ ఖాన్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కె సురేష్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో ఆయనకు ఉత్తర్వులను అందజేశారు.

కస్తూరి పరిమళాలు



ఈ విద్యార్థిని పేరు పి.దీపిక. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీలకు ఇస్తున్న ప్రాధాన్యతను చూసి వీరబల్లిలోని కేజీబీవీలో ఇంటర్మీడియట్ బైపీసీ చేరింది. ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు 953 మార్కులు సాధించింది. వైద్య వృత్తిలో రాణించాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది.

- ఇంటర్‌లో రాణించిన కేజీబీవీ విద్యార్థినులు
- వంద శాతం సాధించిన ఐదు పాఠశాలలు



తంబళ్లపల్లె కేజీబీవీ పాఠశాల

మదనపల్లె సిటీ: గ్రామీణ నేపథ్యం..సామాన్య, మధ్యతరగతి బాలికలు... అయితేనేం..చదువుపై ఉన్న మమకారం వారిని ముందుకు కదిలిస్తుండగా . తల్లిదండ్రుల ఆశలు.. తమ ఆశయాలను మోసుకుంటూ లక్ష్యంవైపు అడుగులు వేశారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో(కేజీబీవీ) విద్యాభ్యాసం చేస్తూ తమ ప్రతిభకు పదును పెట్టుకున్నారు. కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించారు. ఇందుకు ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలే నిదర్శనంగా నిలిచాయి.

- జిల్లాలో 22 కేజీబీవీలు ఉన్నాయి. ఈ పాఠశాలల అభివృద్ధిని గతంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పట్టించుకోని దుస్థితి. 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేజీబీవీలను బలోపేతంత చేసింది. నాడు–నేడు పనులతో వీటి రూపురేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రి, పాఠ్యపుస్తకాలు, ఐఎఫ్‌సీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు తదితర సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చింది. ఫలితంగా కేజీబీవీ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ చదివిన బాలికలు సత్ఫలితాలను సాధించారు.

ఐదు పాఠశాలాల్లో వంద శాతం ఫలితాలు:
జిల్లాలోని ఐదు కేజీబీవీలు వంద శాతం ఫలితాలు సాధించాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చిన్నమండ్యం, ములకలచెరువు, పెద్దమండ్యం, సంబేపల్లి, వీరబల్లి కేజీబీవీల్లో వంద శాతం ఫలితాలు సాధించాయి.

కేజీబీవీలో చదవడం అదృష్టం



కేజీబీవీ పాఠశాలలో చదవడం నా అదృష్టం. మాది సామాన్య కుటుంబం. కార్పొరేట్ పాఠశాలల్లో లేని సౌకర్యాలు మా కేజీబీవీలో ఉన్నాయి. ఇక్కడ పని చేస్తున్న మా టీచర్లు బాగా చదువు నేర్పించారు. ప్రభుత్వం మా బడిలో ఎన్నో సౌకర్యాలు కల్పించింది. విద్యాకానుక, అమ్మ ఒడి పథకాలు అందించింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంసీలో 500 మార్కులకు గాను 450 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది.

–కె.రాధ, కేజీబీవీ, సంబేపల్లి

బాలికల చదువుకు వరం



బాలికలు చదువుకోవడానికి కేజీబీవీలు వరంగా మారాయి. మా పాఠశాలలో లెక్చరర్లు పోటీతత్వం అలవాటు చేశారు. పరీక్షలంటే భయం పోగొట్టారు. నాడు–నేడు పనులతో మా పాఠశాల బాగా అభివృద్ధి చెందింది. నాలాంటి పేద బాలికల చదువుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యం మరవలేనిది. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో 500 మార్కులుగాను 440 మార్కులు సాధించడం అనందంగా ఉంది.

–ఆర్.స్రవంతి, కేజీబీవీ,రామసముద్రం

మంచి ఫలితాలు వచ్చాయి:



జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారు. కేజీబీవీల్లో పని చేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, లెక్చరర్లు ఇంటర్మీడియట్ బాలికలకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేశారు. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి.

–రాధమ్మ, జీసీడీఓ, సమగ్రశిక్ష

జిల్లాకు నవమి శోభ

- ఉత్సాహభరితంగా ఏర్పాట్లు
- కల్యాణానికి వేదికలు సిద్ధం



కడప నగరంలోని శ్రీరాముని విగ్రహం

కడప కల్చరల్: సకల సద్గుణాలకు మారురూపుగా, మానవాళికి ఆదర్శంగా, అపురూపమైన బంధాలకు ఆలవాలంగా నిలిచిన శ్రీరాముడు జన్మించిన శుభదినం. ఆయన సీతారాముడయ్యే శుభలగ్నం వెరసి బుధవారం శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించుకునేందుకు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని రామాలయాలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. కేవలం రామాలయాలే కాకుండా దాదాపు అన్ని వైష్ణవాలయాల్లో కూడా ఈ వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

- వైఎస్సార్ జిల్లాలో చిన్న, పెద్ద రామాలయాలు, వైష్ణవాలయాలు దాదాపు 4 వేలకు పైగా ఉన్నాయి. ఉదయం 9. నుంచి 12.30 గంటల్లోపుగా ఆయా ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక వేదికలను సిద్ధం చేశారు. భక్త బృందాలు రామయ్య కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికీ ప్రసాదంగా పంచిపెట్టేందుకు పానకం, వడపప్పు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. పెద్ద ఆలయాల్లో కల్యాణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులందరికీ కల్యాణ విందు ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రాములోరి బ్రహ్మోత్సవాలకు భద్రతా ఏర్పాట్ల పరిశీలన



పోలీస్ అధికారులకు భద్రతా ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 22న నిర్వహించనున్న సీతారాములవారి కళ్యాణం సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మంగళవారం పరిశీలించారు. సీతారాముల కల్యాణానికి పలువురు ప్రముఖులు రానున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. ఒంటిమిట్టలోని కోదండ రామాలయం, కళ్యాణ వేదిక, తదితర ప్రాంతాలలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై స్థానిక పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రత పర్యవేక్షించేలా పోలీస్ అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.రాజు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశం

రాయచోటి: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ, ఏపీ సెక్రటేరియట్‌లోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి తాగునీటి సరఫరా, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 80 హ్యాబిటేషన్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం జరుగుతోందని, వచ్చే మే, జూన్ మాసాలలో కూడా నీటి సరఫరా చేసేందుకు వెంటనే ప్రపోజల్ పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా రామాపురం, గాలివీడు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, సుండుపల్లె, బి కొత్తకోట, తంబళ్లపల్లె మండలాలలో తాగునీటి ఎద్దడిపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాలోని తాగునీటి పథకాలను పరిశీలించి ఎక్కడైనా మరమ్మతులకు గురై ఉంటే వెంటనే బాగు చేయించాలన్నారు. పైప్‌లైన్ల లీకేజీలు, బోర్ల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబరు. 9032430230కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నీరు, షామియానా, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి వసతులు ఉండేటట్లు చూడాలన్నారు.

కట్టుదిట్టంగా నామినేషన్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లాలో నామినేషన్ల కార్యక్రమం భారీ బందోబస్తు మధ్య కట్టుదిట్టంగా ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి మొదలయ్యే నామినేషన్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ అంశంపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ల సందర్భంగా వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన విధులపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్థానిక అధికారులతో మాట్లాడుతూ సి విజిల్, ఈఎస్ఎంఎస్ డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ ద్వారా సీజర్స్, రిలీజెస్ అంశాలలో ప్రగతిని ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించాలన్నారు. నామినేషన్స్ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని, అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నివేదికలను సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌లపై రోజువారి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఎస్ఎస్టీ, ఎఫ్‌టీ టీమ్స్, మైక్రో అబ్జర్వర్లపై నియామకం, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు, పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీమ్స్, మైక్రో అబ్జర్వర్ల నియామకం, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీమ్స్ రిజిస్టర్ మెయింటినెన్స్ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.

ఉరుసు బుక్‌లెట్ విడుదల



ఉరుసు మహోత్సవ బుక్‌లెట్లు విడుదల చేస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇమ్రాన్, షేక్ ఇస్మాయిల్

కమలాపురం: దక్షిణ భారతదేశంలోనే ఘనంగా నిర్వహించే స్థానిక దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా ఉరుసు ఉత్సవాల బుక్‌లెట్లను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ ఇమ్రాన్ విడుదల చేశారు. మంగళవారం దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రీ సోదరుడు వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్‌తో కలసి ఆయన బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాలకు గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పణ తదితర కార్యక్రమాలు ప్రొటోకాల్ ప్రకారం నిర్వహించామన్నారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం తరపు నుంచే ఈ నెల 22 నుంచి జరిగే ఉత్సవాలకు చాదర్ సమర్పణ చేపడతామన్నారు.

మోహినీరూపం..
భక్తుల పరవశం

సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన పట్టాభిరాముడు



మోహినీ అవతారంలో మురిపిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

వాల్మీకిపురం: అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధి చెందిన వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి 8 గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో తేజోమూర్తిగా మురిపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభవాహనంపై స్వామివారు తేజోమూర్తిగా తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. సూర్యప్రభ వాహన సేవ అనంతరం 10 గంటల నుంచి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల సేవ జరిగింది. రాత్రి 8గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో ఊరేగుతున్న స్వామివారికి మహిళలు నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటాలు, చెక్కభజనలు, భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నేడు
బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం 8గంటల నుంచి తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం ఊంజలసేవ, 8నుంచి 10గంటల వరకు శ్రీరామ కళ్యాణోత్సవం , 11నుంచి 2.30గంటల వరకు గరుడవాహనసేవ.

ఛీప్ ట్రిక్స్



బ్రహ్మయ్య



బత్యాల

- బాబు పాలిట్రిక్స్‌తో కాపుల కంట కన్నీరు..
- ధృతరాష్ట్రుని కౌగిలిలో చిక్కి శల్యమైన బ్రహ్మయ్య, బత్యాల
- చంద్రబాబు వైఖరిపై రగిలిపోతున్న బత్యాల, బ్రహ్మయ్య వర్గాలు

రాజంపేట: టీడీపీ అధినేత చంద్రబాబు తన ఎదుగుదలకు,రాజకీయాల కోసం ఎవరినైనా బలిచేస్తారు. ఇందుకు ఉదాహరణగా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్యను ప్రధానంగా చెప్పుకోవచ్చు.. ఇప్పుడు అదే కోవలో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు కూడా చేరాడనే వాదన వారి సామాజికవర్గాల్లో వినిపిస్తోంది. బాబు వైఖరిపై బత్యాల, బ్రహ్మయ్య వర్గాలు రగిలిపోతున్నాయి. ధృతరాష్ట్రుని కౌగిలిలో నాడు బ్రహ్మయ్య, నేడు బత్యాల చిక్కి శల్యమయ్యారని కాపువర్గాలు పేర్కొంటున్నాయి.

బత్యాల తరహాలోనే సుగవాసికి చాన్స్..
2019 ఎన్నికల్లో రైల్వేకోడూరు నుంచి మాజీ ఎమ్మెల్యే బత్యాల చెంగల్రాయుడును ఎలా తీసుకొచ్చారో, అదే రీతిలో ఇప్పుడు రాయచోటి మాజీ జెడ్పీటీసీ సుగవాసి పాలకొండ్రాయుడును తీసుకొచ్చారు. బత్యాలను లూప్‌లైన్‌లోకి తోసేశారు. పట్టించుకోనే పరిస్థితిలో చంద్రబాబులేడు. రాజంపేటలో మనీపాలిట్రిక్స్‌కు చంద్రబాబు తెరలేపారని విమర్శలు వెలువడుతున్నాయి. దీంతో అటు బత్యాల, ఇటు బ్రహ్మయ్య వర్గీయులను సుగవాసి కన్నెత్తి చూడటంలేదు.బత్యాలకాంగ్రెస్‌లో ఉన్నప్పుడు మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో పరిచయాలు ఉండేవి.ఈ నేపథ్యంలో టికెట్ విషయంపై కిరణ్‌కుమార్‌రెడ్డి బత్యాలను కలిశారు. టీడీపీ అభ్యర్థి సుగవాసికి మద్దతు తెలిపాలని కోరగా బత్యాల సున్నితంగా తిరస్కరించారు. టికెట్ విషయంలో పునరాలోచించాలని కోరారు.అయితే కిరణ్‌కుమార్‌రెడ్డి ఎటువంటి సమాధానం రాలేదు.

బాబు రాజకీయానికి బ్రహ్మయ్య బలి..
ఎన్టీఆర్ హయాంలో అనూహ్యంగా రాజకీయ ప్రవేశం చేసిన బ్రహ్మయ్య చంద్రబాబు రాజకీయానికి బలయ్యారు. నాలుగుసార్లు పోటీ చేసిన బ్రహ్మయ్య రెండుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాలిలో ఓడిపోతాడని తెలిసినప్పటికీ ఉపఎన్నికల్లో బ్రహ్మయ్యను దించి గొంతుకోశారనే అపవాదు బాబును వెంటాడుతోంది. అప్పటి నుంచి మరోసారి ఎమ్మెల్యే టికెట్ కోసం బాబు చుట్టూ ప్రదక్షిణలు చేసి చివరికి అలసిపోయారు. తర్వాత ఆయన మరణించారు. ఆ విధంగా బాబు పాలిట్రిక్స్‌కు బ్రహ్మయ్య బలైపోయారు.

కాపుల కంట కన్నీరు..
చంద్రబాబు పాలిట్రిక్స్‌తో కాపులు(బలిజలు) కన్నీరు పెడుతున్నారు. ఫలితంగా నియోజకవర్గంలో బలిజ సామాజికవర్గాలు నిట్టనిలువునా చీలిపోయాయి. సుగవాసికి పైకి మద్దతు పలికినా స్థానికేతరడనే భావన మనుసులో ఉంది. 2019 నుంచి రాజంపేట టీడీపీ వర్గీయులకు పెద్దదిక్కుగా ఉంటూ వచ్చిన బత్యాలకే పార్టీలో దిక్కులేని పరిస్థితులు ఏర్పడ్డాయి. బత్యాల వెంట ఉన్న పార్టీ క్యాడర్‌కు ప్యాకేజీలను ఎర వేస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.

టన్ను చీనీ రూ.40 వేలు



చీనీమార్కెట్‌లో వేలంపాట నిర్వహిస్తున్న రైతులు, అధికారులు

పులివెందుల రూరల్: పులివెందుల వ్యవసాయ చీనీ మార్కెట్‌లో చీనీధరలు రోజురోజుకు కొత్త రేటు పలుకుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే చీనీ టన్ను ధర రూ.35వేల నుంచి రూ.40వేలు పలకడంతో చీనీ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, పులివెందుల మండలాల్లోని గ్రామాల నుంచి రైతులు తాము పండించిన చీనీ కాయలను విక్రయాలు జరిపేందుకు పులివెందులలోని చీనీకాయల మార్కెట్‌కు తరలిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజు 650టన్నుల చీనీకాయలు వచ్చాయి. అనంతపురం జిల్లాలోని చీనీకాయల మార్కెట్‌లో షూట్ ఉండడంతో ఆ ప్రాంత రైతులు కూడా పులివెందుల మార్కెట్‌కు కాయలను తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. పులివెందుల చీనీమార్కెట్‌లో ఎటువంటి షూట్ లేకపోవడంతో రైతులు చాలా మంది మార్కెట్‌కే తరలిస్తున్నారు. ఈ ప్రాంత రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో చీనీకాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. చీనీకాయల మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా మార్కెట్‌యార్డు చైర్మెన్ చిన్నప్ప, వైస్ చైర్మెన్ సర్వోత్తమరెడ్డి , అధికారులు ఎర్యవేక్షిస్తూ మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

8 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

రాయచోటి టౌన్ : పేకాట ఆడుతున్న ఎనిమిది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామంలో సోమవారం రాత్రి మొత్తం 18 మంది పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలసి దాడులు చేసినట్లు తెలిపారు. వారినుంచి రూ.27వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీ కొని వృద్ధుడు గాయపడిన సంఘటన మంగళవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. ఈడిగపల్లెకు చెందిన వెంకటరమణ (75) పొలం వద్ద నుంచి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ మద్యం సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి



రాయచోటి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

రాయచోటి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి జిల్లాలోకి తరలించే అక్రమ మద్యంపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులకు సూచించారు. అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాయచోటి పరిధిలో స్థానిక ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ హిమబిందు, ఎస్.ఐ మురళిలతో కలిసి ఆయన పర్యటించారు. మూడు రోజులుగా జిల్లాలో పర్యటిస్తూ అక్రమ రవాణాపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందికి ఆదేశాలిస్తున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను, సీజ్ చేసిన లిక్కర్ వివరాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలపై సిబ్బందితో సమీక్షించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంసీసీ కింద నమోదైన కేసుల వివరాలపైన కూడా సమీక్షించారు.

మామిడి తోట దగ్ధం



వనమారెడ్డిగారిపల్లెలో కాలిపోయిన తోట

కురబలకోట : మండలంలోని వనమారెడ్డిగారిపల్లెలో అరుణమ్మ, పాపిరెడ్డికి చెందిన పది ఎకరాల మామిడి తోట మంగళవారం దగ్ధమైంది. ఇద్దరు ఐదు ఎకరాల చొప్పున సాగు చేశారు. ఐదేళ్ల చెట్లు 500, 12 ఏళ్ల చెట్లు 500 కాలిపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా.. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారా అన్నది అంతుబట్టడం లేదని చెబుతున్నారు. ఇద్దరు రైతులకు రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ఈ సంఘటనపై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

క్షణికావేశం..యమపాశం..!

- యువత తొందరపాటు నిర్ణయాలతో తల్లిదండ్రుల కలవరపాటు
- వారం రోజుల వ్యవధిలో నలుగురు విద్యార్థుల ఆత్మహత్య
- చావు పరిష్కారం కాదంటున్న నిపుణులు

వారం క్రితం సిద్ధవటంలో పాలెం రెడ్డిరామ్మోహన్.. ఆదివారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ విద్యార్థిని సురేఖ.. సోమవారం రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థిని రాణి మహంక... తాజాగా యోగివేమన విశ్వవిద్యాలయంలో పీజీ బయోటెక్నాలజీ విద్యార్థిని సుల్తానా.. ఇలా.. ఒక్కొక్కరు క్షణికావేశంలో ప్రాణం తీసుకుని కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారు. తొందరపాటుగా తీసుకున్న నిర్ణయం వారి కుటుంబాల పాలిట అశనిపాతంలా మారుతోంది. వారం రోజుల వ్యవధిలో జిల్లాలో వరుసగా నలుగురు ఆత్మహత్య చేసుకోవడం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది. 'అర్థం చేసుకుంటే కోపం కూడా అర్థవంతమైనదే'.. అలాంటిది చిన్న చిన్న విషయాలకే ప్రాణం తీసుకునేలా వ్యవహరించడం సరికాదని మనోవిజ్ఞానశాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు.



● వైవీయూలో విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన ఎస్. షమ్మా సుల్తానా

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పీజీ బయోటెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్. షమ్మా సుల్తానా(21) ఆత్మహత్య కలకలం రేపింది. ఇటీవల వరుస సెలవులు రావడంతో తన స్వగ్రామమైన కదిరి పట్టణానికి వెళ్లి సెలవుల అనంతరం సోమవారం విశ్వవిద్యాలయానికి చేరుకుంది. అనంతరం మంగళవారం యధావిధిగా కళాశాలలో తరగతులకు హాజరైన ఆమె అరగంట ముందుగా క్లాస్‌లో నుంచి హాస్టల్‌కు వెళ్లిపోయినట్లు తోటి విద్యార్థులు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో తోటి విద్యార్థినులు మెస్‌కు భోజనం చేసేందుకు వెళ్లిన సమయంలో మహిళల వసతి గృహంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే అప్రమత్తమైన తోటి విద్యార్థినులు, సిబ్బంది సమాచారం అధికారులకు అందించి, హుటాహుటిన ఆమెను రిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని వెంట విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వెళ్లడంతో పాటు వారి తల్లిదండ్రులకు, పోలీసులకు వెంటనే సమాచారాన్ని అందించారు. కాగా సుల్తానా రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచింది. కాగా రిమ్స్‌కు కడప డీఎస్పీ షరీఫ్ చేరుకుని వైవీయూ అధికారులు, విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పెండ్లిమర్రి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

చిన్న చిన్న విషయాలకే..

పరీక్షలు తప్పామనో.. కోరుకున్నది జరగలేదనో.. ప్రేమ విఫలమైందనో.. తల్లిదండ్రులు తిట్టారనో.. ఇలా చిన్నచిన్న కారణాలకే విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు వారి కుటుంబాలకు తీరని వేదనను మిగుల్చుతున్నాయి. పరీక్షలు ఫెయిలైతే.. మరోసారి రాసుకుని పాస్ కావచ్చు.. ఎందరో చదువులో విఫలమైనా జీవితంలో విజేతలుగా నిలిచినవారు ఉన్నారన్న విషయం గుర్తుంచుకోవాలి. యవ్వనంలో ఉంటే ఆకర్షణ, ప్రేమల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రేమ పేరుతో జరిగే మోసాలకు బలవడం కాకుండా.. మిమల్ని ఎంతగానో ప్రేమించే మీ కుటుంబ సభ్యులను గుర్తుచేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సమస్య ఏదైనా వచ్చినప్పుడు తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నారు.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, పరిష్కారం లేని సమస్య లేదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని సైకాలజిస్టులు పేర్కొంటున్నారు. మరికొందరు విద్యార్థులు విద్యలో ఒత్తిడి తట్టుకోలేక, తల్లిదండ్రులు సైతం తమ పిల్లల మానసిక స్థితిని, వారి సామర్థ్యాన్ని అంచనా వేయకుండా తోటివారితో పోల్చుతూ.. ఒత్తిడి తీసుకురావడం సరికాదని నిపుణులు అంటున్నారు. కారణాలేవైనా చావు పరిష్కారం కాదని, బతికి సాధించాలని, జీవితంలో ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. అదే విధంగా విద్యాసంస్థల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సైకలాజికల్ కౌన్సిలర్‌లను ఏర్పాటు చేయాలన్న నిబంధనను కచ్చితంగా పాటిస్తూ ప్రతి కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేసి సున్నిత మనస్కులైన విద్యార్థులకు, అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఉరో..బేటీ .. సుల్తానా.!



రిమ్స్ మార్చురీలో తన కుమార్తె సుల్తానా మృతదేహాన్ని పట్టుకుని విలపిస్తున్న తల్లి

కడప అర్బన్ : ఉరో బేటీ సుల్తానా... అంటూ తన కుమార్తె మృతదేహాన్ని పట్టుకుని తల్లి షమీరా బోరున విలపించిన దృశ్యం అందరిని కంట పెట్టించింది. రంజాన్ పండుగకు ఇంటికి వచ్చి అందరితో సరదాగా గడిపిన షమ్మా సుల్తానా (22) ఇంటి నుంచి వచ్చిన 24 గంటల్లోపే విగతజీవిగా మారడంతో తల్లి మనసు తల్లడిల్లిపోయింది. తల్లిదండ్రులు షమీరా, హఫీజ్‌లకు షమ్మా సుల్తానా ఏకైక కుమార్తె. ఆమె కన్నా చిన్నవాడైన కుమారుడు ఉన్నాడు. తండ్రి హఫీజ్ గత కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్‌లో ఉన్నారు. ఆయనతో కుటుంబ సభ్యులంతా ఫోన్ ద్వారా సరదాగా మాట్లాడి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. హాయిగా పండుగ చేసుకున్నారు. పండుగ తరువాత సోమవారం కదిరి నుంచి వైవీయూకు సుల్తానా వచ్చింది. మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనతో వైవీయూలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, కడప రూరల్ సీఐ నాగరాజు విచారణ చేపట్టారు.

వైవీయూ అధికారుల దిగ్భ్రాంతి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం విద్యార్థిని ఎస్. సుల్తానా మృతి పట్ల వైవీయూ అధికారులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు తరగతి గదిలో తోటి విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న విద్యార్థి అంతలోనే వసతిగృహంలో బలవన్మరణానికి పాల్పడటం విశ్వవిద్యాలయంలో కలచివేసింది. కాగా విద్యార్థి మృతితో ఆందోళన చెందుతున్న విద్యార్థినులకు వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి వెళ్లి ధైర్యం చెప్పారు. విశ్వవిద్యాలయ అధికారులు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు.

న్యాయ విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో మంగళవారం పీజీ విద్యార్థిని సుల్తానా ఆత్మహత్య సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కో కన్వీనర్ ఎంఆర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు రిమ్స్‌లో మృతదేహాన్ని సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు సమగ్ర విచారణ జరిపి ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తులెవరో తేల్చి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

క్షణికావేశ నిర్ణయాలు సరికాదు



ప్రతిరోజూ ఏదో ఒకచోట విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు వస్తుండటం ఆందోళన కలిగించే అంశం. కారణాలేవైనా విద్యార్థులు క్షణికావేశంలో చనిపోవాలనే నిర్ణయం సరికాదు. సమస్య గురించి రెండు నిమిషాలు ఆలోచించడం, సన్నిహితులతో చర్చించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుంది. తద్వారా చెడు ఆలోచనలు తొలగిపోతాయి. చనిపోవాలనుకున్న సమయంలో కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకుంటే ఇలాంటి ఘటనలు చేయాలన్న ఆలోచనలు రావు. విద్యకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్భయంగా చర్చించాలి. సున్నిత మనస్కులను తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలి. ఏవైనా వారిలో మార్పులు కనిపిస్తే కచ్చితంగా అడిగి తెలుసుకోవాలి. సాధించాలన్న పట్టుదల ఉండాలే తప్ప చచ్చి సాధించేదేమీ ఉండదన్న విషయం గుర్తించాలి.

– డాక్టర్ కె. లలిత, మనోవిజ్ఞానశాస్త్ర విభాగాధిపతి, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప

ప్రతి సమస్యకు పరిష్కారం ఉందని గుర్తించాలి



ప్రతి సమస్యకు పరిష్కారం ఉందన్న విషయం విద్యార్థులు గుర్తించాలి. అదే విధంగా అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్న విషయం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గుర్తించాలి. విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెట్టకూడదు. మంచి చెడులు తెలుసుకునే మంచి పౌరునిగా తయారయ్యేలా తల్లిదండ్రుల పెంపకం ఉండాలి. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన వచ్చిన కొద్ది నిమిషాల పాటు సంయమనం పాటించడం, తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులతో చర్చిస్తే చెడు సమయం వెళ్లిపోతుంది. చావు ఎప్పటికీ పరిష్కారం కాదు.. ప్రతి దానికి ప్రత్యామ్నాయం ఉందన్న విషయం తెలుసుకోవాలి. భావోద్వేగాలను నియంత్రించుకోవాలి.

– డాక్టర్ మేపరాల లాజరస్, మనోవిజ్ఞానశాస్త్ర సహ ఆచార్యులు, యోగివేమన విశ్వవిద్యాలయం, కడప

ఆ పార్టీలది ట్రయాంగిల్ లవ్‌స్టోరీ

అన్నమయ్య జిల్లా మదనపల్లె, పీలేరు, బి.కొత్తకోట సభల్లో షర్మిల



పీలేరు రోడ్‌షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

మదనపల్లె/ బి.కొత్తకోట /పీలేరు : రాష్ట్రంలో టీడీపీ-జనసేన, బీజేపీ, వైఎస్సార్‌సీపీల మధ్య ట్రయాంగిల్ లవ్‌స్టోరీ నడుస్తోందని ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. మంగళవారం అన్నమ్మయ్యజిల్లా మదనపల్లె, బి.కొత్తకోట, పీలేరులో జరిగిన ఏపీ న్యాయ్ యాత్ర సభల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు, జగన్‌ల స్వప్రయోజనాల కోసం బీజేపీకి రాష్ట్రప్రయోజనాలను తాకట్టుపెట్టి బానిసల్లా ఊడిగం చేస్తున్నారన్నారు. బీజేపీతో చంద్రబాబు పొత్తు ఉంటే-జగన్ మోడీకి తొత్తు అని, ఒకరిది బహిరంగ పొత్తు అయితే..మరొకరిది రహస్యతొత్తని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి ఓటువేస్తే..బీజేపీకి వేసినట్లేనన్నారు. జగన్ రైతులకు రాయితీపై డ్రిప్ ఇవ్వలేదని, పంట పరిహారం చెల్లించలేదన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 90శాతం పూర్తి చేస్తే, చంద్రబాబు ఐదేళ్లలో 10 శాతం పనులు పూర్తి చేయించలేకపోయారన్నారు. చంద్రబాబు, జగన్ గెలిస్తే బీజేపీకి తొత్తులుగా ఉంటారన్నారు. పదేళ్ల క్రితం హోదా వచ్చి ఉంటే ఏపీ పొరుగు రాష్ట్రాలతో అభివృద్ధిలో పోటీపడేదన్నారు. రాహుల్‌గాంధీ ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారని, ఆ హోదా తేవడం కోసమే తాను కాంగ్రెస్‌లో చేరినట్టు చెప్పారు. బీజేపీతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాదన్నారు. పదేళ్లుగా చంద్రబాబు, జగన్‌లు హోదా మాటలేకుండా చేశారన్నారు. చంద్రబాబు ఐదేళ్లు అమరావతిని రాజధానిగా చెప్పి, సింగపూర్ చేస్తానని 3డీ వీడియోలు చూపిస్తే.. జగన్ ఒక్కటి సరిపోదు..మూడు రాజధానులు అని, చివరకు రాజధాని అని చెప్పుకోవడానికి లేకుండా చేశాడన్నారు. కాంగ్రెస్‌పార్టీని ఆశీర్వదిస్తే రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదాతో పాటు, రైతులకు 2లక్షల రుణమాఫీతో పాటు సంక్షేమ పథకాలను ప్రతి గడప వద్దకు తీసుకువస్తుందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి, పీలేరు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమశేఖర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రెడ్డిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఆరుగురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం బొమ్మకోళ్లపల్లెకు చెందిన రైతు వెంకటరమణ (67) కుటుంబ సమస్యల కారణంగా సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గుర్రంకొండ ఇందిరమ్మకాలనీకి చెందిన భాస్కర్ భార్య స్వాతి(35) భర్తతో గొడవపడి థైరాయిడ్ మాత్రలు మింగింది. అదే విధంగా గుర్రంకొండ మండలం దౌలత్‌ఖాన్ పల్లెకు చెందిన రామయ్య కుమారుడు ఎస్.మల్లికార్జున (30) భార్య మనస్పర్థల కారణంగా స్వగ్రామమైన పుంగనూరు మండలం ఈడిగపల్లె గ్రామం ఎర్రగుంట్లపల్లెకు వెళ్లిపోయింది. తిరిగి కాపురానికి రాకపోవడంతో మల్లికార్జున మనస్తాపంతో మంగళవారం విషద్రావణం తాగాడు. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య నాగలక్ష్మి (20) భర్తతో గొడవపడి మనస్తాపంతో విషద్రావణం తాగింది. మదనపల్లె మండలం జన్మభూమి కాలనీకి చెందిన భాస్కర్ భార్య ఎస్.అరుణ (40) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగింది. బీకేపల్లె పంచాయతీ చంద్రాకాలనీ కనకదాసనగర్‌కు చెందిన రామస్వామి కుమార్తె వి.భార్గవి (24) కుటుంబ సమస్యలతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

టీడీపీ కార్యక్రమంలో జెడ్‌బీఎన్‌ఎఫ్ ఉద్యోగి

మైదుకూరు : మైదుకూరు మండలం తువ్వపల్లె పంచాయతీలో మంగళవారం టీడీపీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్‌ఎఫ్) విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి పాల్గొన్నారు. తువ్వపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పలు కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. ఆ కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాలువపల్లె వెంకటయ్య అనే వ్యక్తి పాల్గొనడం గమనార్హం. చెన్నూరులో ప్రకృతి వ్యవసాయం విభాగంలో వెంకటయ్య ఎల్-2 ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వారు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినా వెంకటయ్య టీడీపీ కార్యక్రమంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజును వివరణ కోరగా, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నవారు, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్నారు. వెంకటయ్యపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకులపై హత్యాయత్నం

కడప అర్బన్ : కడప నగరం కో-ఆపరేటివ్ కాలనీలో జీవీఆర్ టవర్స్ సమీపంలో ఈనెల 15వ తేదీ రాత్రి సోను (26), సుజిత్(29)లపై ముగ్గురు యువకులు కత్తితో దాడి చేశారు. సంజయ్, రాహుల్‌లు ఇమ్రాన్ అనే వ్యక్తితో గొడవపడ్డారు. ఈ క్రమంలో సుజిత్ అనే వ్యక్తికి సంబంధించిన మోటార్ సైకిల్‌ను కాల్చివేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన సుజిత్, అతని స్నేహితుడు సోనుపై సంజయ్ రాహుల్, హాజీ, శ్రీకాంత్‌లు హత్యాయత్నానికి పాల్పడ్డారు. సుజిత్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్‌టౌన్ సీఐ సి. భాస్కర్ రెడ్డి తెలిపారు.

మేము కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమా? ఉపాధి కూలీలమా?

కమలాపురం : 'మేము కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలమా? లేక ఉపాధి పని కూలీలమా? కాంగ్రెస్ పార్టీ పెద్దలు మాకు న్యాయం చేయాలి' అంటూ కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ నేత పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. కమలాపురంలో ఇండియా కూటమి నేతలు మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశం మధ్య లేచి చంద్రశేఖర్ రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇండియా కూటమి నేతలు తులసి రెడ్డి, జి.ఈశ్వరయ్య, గాలి చంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రమేష్‌కుమార్‌రెడ్డి

సిద్ధవటం : మండల కేంద్రమైన సిద్ధవటంలో మంగళవారం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గం నాయకుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, సిద్ధవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి ఏ.పీ. ప్రభుత్వం అమెరికా ప్రతినిధి పండుగాయల రత్నాకర్‌ల సమక్షంలో సిద్ధవటానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో ఖాదర్‌బాషా, సలీమ్, అలీబాషా, కనకాల నరసింహారావు, సుబ్రమణ్యం, అల్లా బక్ష్, అహ్మదీ, ఖాజాపీర్, జహిరాబీ, ఇందిర, తహరున్నీసా తదితరులు ఉన్నారు ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు, మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, యూత్ కన్వీనర్ వావిళ్ల శ్రీనివాసులరెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె, గువ్వలచెరువు, గోపగుడిపల్లె గ్రామాల్లో 150 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. అలాంటి నాయకునికి రాష్ట్ర ప్రజలందరూ మద్దతు పలికి తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గడికోట శ్రీకాంత్‌రెడ్డిని, ఎంపీగా మిథున్‌రెడ్డిని గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, గాలివీడు మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సుదీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి భూషన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



చెన్నూరు : మండలంలోని చిన్న మాచుపల్లె రెవెన్యూ పరిధిలోని శాటిలైట్ సిటీ వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని యువకుడు (30) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు మృతుడు ఉదయం 6.00 గంటల సమయంలో మద్యం మత్తులో అక్కడే తూలుతూ తిరుగుతూ ఉన్నాడన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక




రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా బాస్కెట్‌బాల్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ జూనియర్ విభాగం బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికల చైర్మన్ సి. శ్రీనివాసరెడ్డి, సభ్యులు శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నూజివీడులో నిర్వహించనున్న 9వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

జిల్లా బాలికల జట్టు : రిజ్వానా, చంద్రిక, యశశ్విని, రెడ్డిసాయి, చంద్రమౌనిక, నందిని, మొబీ, వెంకటమౌనిక, అఫ్రీన్, వినూత్న, భవిత, అనిత. రోహిత(కోచ్), సుబ్బమ్మ (మేనేజర్) **జిల్లా బాలుర జట్టు :** తమన్, కిశోర్, విజయభాస్కర్, తేజ, వినీల్‌కుమార్‌రెడ్డి, హిమవరాహన్‌రెడ్డి, శివ, నితిన్, మణికంత, జీవన్, జశ్వంత్, వివేక్. శ్రీకాంత్ (కోచ్), నాగార్జున (మేనేజర్).

గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



చింతకొమ్మదిన్నె : కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ మూడవ మలుపు వద్ద లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో మరో వాహనంపై బోల్తా పడింది. సీకే దిన్నె అప్‌గ్రేడ్ సీఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల మేరకు... రాయచోటి నుంచి కడపకు వస్తున్న బొగ్గుల లోడు లారీ సరిగ్గా గువ్వల చెరువు ఘాట్ మూడవ మలుపు వద్దకు రాగానే బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ఎదురుగా వస్తున్న మరో వాహనంపై పడింది. మరో వాహనంలో ఇరుక్కున్న డ్రైవర్‌ను క్రేన్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.